పల్లెల్లో ఫ్లోరైడ్ భూతం

- రెండునెలల క్రితం ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలను ప్రకటించిన వైద్యశాఖ
- రాజాం నియోజకవర్గంలో 25 గ్రామాల పేర్లు వెల్లడి
- ఇంతవరకు చర్యలు శూన్యం
- భయాందోళనలో ప్రజలు


రేగడి మండలంలో ఫ్లోరైడ్ ప్రభావిత అంబకండి గ్రామం

రాజాం: పచ్చటి పల్లెలను ఫ్లోరైడ్ మహమ్మారి వణికిస్తోంది. ఇన్నాళ్లూ తాము తాగుతున్న హ్యాండ్ బోర్లు, నేలబావుల్లోని నీరు సురక్షితమే అని భావించిన ఆ పల్లెవాసులు ఇప్పుడు ఆ నీటిలో ఫ్లోరైడ్ ఆనవాళ్లు ఉన్నాయని తెలిసే సరికి భయాందోళన చెందుతున్నారు.రాజాం నియోజకవర్గంలోని పలుగ్రామాల ప్రజలు తాగుతున్న నీటిలో ప్రమాదకర ఫ్లోరైడ్ శాతం అధికంగా ఉందని రెండునెలల క్రితం జిల్లా వైద్యారోగ్యశాఖ ప్రకటించింది. గతంలో రాజాం నియోజకవర్గంలోని సంతకవిటి మండలంలో మోదుగులపేట, రేగిడి మండలంలోని అంబఖండి గ్రామాలను మాత్రమే ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాలుగా గుర్తించారు. ఇప్పుడు రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల్లో 25 గ్రామాల్లో ఫ్లోరైడ్ ప్రభావం ఉందని వైద్యశాఖ ధ్రువీకరించింది. ఉష్ణోగ్రతల ఆధారంగా, పలుగ్రామాల్లో విద్యార్థులను, వృద్ధులను పరీక్షించిన పిదప ఆయా గ్రామాల్లోని భూగర్భజలాల్లో ఫ్లోరైడ్ ఉన్నట్టు వైద్యారోగ్యశాఖ భావించింది. ఫ్లోరైడ్ స్థాయి 0.7 నుంచి 1.2 పీపీఎంగా ఉన్న జలాల వల్ల ఇబ్బందిలేదని, 1.5 పీపీఎం కంటే ఎక్కువ ఉన్న నీటిని తాగరాదని


ఫ్లోరైడ్ ప్రభావం ఉందని వైద్యారోగ్యశాఖ గుర్తించిన రాజాం మండలంలోని అంతకాపల్లి గ్రామం

వైద్యారోగ్యశాఖ వివరించింది. కానీ అధికారులు ఇంతవరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఫ్లోరైడ్‌ను నివారించేందుకు చేపట్టే చర్యల్లో భాగంగా భూగర్భ జలాలు వినియోగించకుండా ప్రత్యామ్నాయంగా పంపింగ్ రక్షిత పథకాల ద్వారా తాగునీరు సరఫరా చేయాల్సి ఉంది. గ్రామాల్లో శుద్ధ జలం ప్లాంట్లు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. బాధితులకు మెరుగైన వైద్యసేవలందించాలి.అయితే ఇంతవరకూ ఈ చర్యలు ఆయా గ్రామాల్లో కనిపించడంలేదు. ఫ్లోరైడ్ భూతం బారిన పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వైద్యశాఖ అవగాహన కల్పించకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఈలక్షణాలు ఎక్కువ..

వైద్యశాఖ ప్రకటించిన ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాల్లో విద్యార్థులకు, వృద్ధులకు అధికంగా నోటి పంటివరుస, దంతాల రంగు మారడం, కాళ్లు, చేతులలో చిన్నచిన్న మార్పులు ఉన్నట్లు గుర్తించారు. ఈ గ్రామాల్లో ఎక్కువగా ప్రజలు స్థానికంగా లభించే నేలబావులు, చేతిపంపు నీటిని వినియోగిస్తున్నట్లు పరిగణించారు. రక్షిత పథకాల ద్వారా జలజీవన్ మిషన్ కుళాయిల నీటిని వినియోగిస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డా రు. ఈ గ్రామాలకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.4కోట్లు కేటాయించి, జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటి కుళాయిల పనులు ప్రారంభిస్తే కూటమి ప్రభుత్వం వీటిని పూర్తిగా పక్కనపెట్టింది.

ప్రజల్లో ఆందోళన

ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాల వివరాలు బహిర్గతం చేయగానే ఆయా గ్రామాల ప్రజల్లో ఆందోళన అధికమైంది. అలాగని ప్రత్యామ్నాయ చర్యలు కూడా ప్రభుత్వం చేపట్టలేదు. రేగిడి, సంతకవిటి, వంగర మండలాల్లో భారీ రక్షిత మంచినీటి పథకాలు ఉన్నాయి. వీటి ద్వారా ఆయా మండలాల్లో అన్ని గ్రామాలకు తాగునీరు అందాల్సి ఉండగా, సగం గ్రామాలకు కూడా నీరు పూర్తి స్థాయిలో అందని పరిస్థితి. కొన్ని గ్రామాల్లో ఇంత వరకూ వీధి కుళాయిల కనెక్షన్ ఇవ్వలేదు.

పట్టించుకోవడం లేదు



అంబఖండి గ్రామంలో ఫ్లోరైడ్ సమస్య ఉంది. అధికారులు పరిశీలనలు చేయడం, అప్రమత్తంగా ఉండండని చెప్పడమే తప్ప ప్రత్యామ్నాయ పనులు చేపట్టడంలేదు. ప్రజల ఆరోగ్యాన్ని పట్టించుకోవడంలేదు. గ్రామంలో ప్రజలకు వైద్యశాఖ అవగాహన కల్పించడంతో పాటు ఫ్లోరైడ్ బారినుంచి కాపాడేందుకు చర్యలు తీసుకోవాలి.

– లావేటి గణపతి, అంబఖండి, రేగిడి మండలం.

ఫిల్టర్ వాటర్ స్కీం ఏర్పాటుచేయాలి



గోవిందపురం గ్రామంలో ఫ్లోరైడ్ ఉందని అన్నారు. తాగునీటికి ఇప్పటికే ఇబ్బందులున్నాయి. మా పంచాయతీ ప్రజలకు ప్రత్యేకంగా తాగునీటిని సరఫరా చేయాలి. నాగావళి నది నుంచి ఫిల్టర్ చేసిన నీటి సరఫరా పథకాన్ని ఈ పంచాయతీకి అమలుచేయాలి.

– రాగోలు రమేష్‌నాయుడు, సర్పంచ్, గోవిందపురం, సంతకవిటి మండలం.

ఆరోగ్య తనిఖీలు చేస్తున్నాం



పొగిరి గ్రామంలో శాంపిల్స్ తీసే సమయంలో ఇతర ప్రాంతాల విద్యార్థులు, వ్యక్తులు ఉండి ఉంటారని భావిస్తున్నాం. జిల్లా వైద్యశాఖ వివరాలు వెల్లడించిన వెంటనే గ్రామంలో ఆరోగ్య తనిఖీలు చేశాం. దంతాల్లో చిన్నచిన్న సమస్యలు మినహా ఫ్లోరైడ్ సమస్యలు పొగిరిలో కనిపించలేదు. పాలకులు, అధికారులను అప్రమత్తం చేసి, భూగర్భజలాలను తాగునీటిగా వినియోగించ వద్దని చెప్పాం. ఫ్లోరైడ్ ప్రభావం ఉందని గుర్తించిన గ్రామాల్లో ప్రజలకు ప్రతీ వారం ఆరోగ్యతనిఖీలు చేస్తున్నాం.

– గట్టి భార్గవి, పీహెచ్‌సీ వైద్యాధికారి, పొగిరి, రాజాం మండలం

నియోజకవర్గంలో ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాల వివరాలు

మండలం	గ్రామాలు
రాజాం	అంతకాపల్లి, పొగిరి, అమరాం, దోసరి, మారేడుబాక
సంతకవిటి	గోళ్లవలస, మండాకురిటి, గోవిందపురం, బిల్లాణి, గుల్లసీతారాంపురం, మాధవరాయపురం
రేగిడి	మునకలవలస, కొర్లవలస, అంబకండి, లింగాలవలస, పెద్దశిర్లాం, పారంపేట, వన్నలి, ఒప్పంగి, వెంకంపేట
వంగర	కోనంగిపాడు, కొట్టిశ, శ్రీహరిపురం, లక్ష్మీపేటకాలనీ, మరువాడ

యువతకు ఆదిభట్ల జీవిత చరిత్ర తెలియజేయాలి


మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న రామ్మూర్తినాయుడు, ఆనంద నారాయణదాసు

బొబ్బిలి: హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు జీవిత చరిత్రను నేటి యువతకు తెలియజేయా లని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ రౌతు రామ్మూర్తినాయుడు, ఆదిభట్ల ముని మనవడు ఆనంద నారాయణ దాసు, బొబ్బిలి ఉప ఖజానాధికారి పి.వి.పద్మనాభం అన్నారు. ఆదిభట్ల 161వ జయంతి వేడుకలను ఆదిభట్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం బొబ్బిలిలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆదిభట్ల నారాయణదాసు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ హరికథా పితామహునిగా, పంచముఖి పరమేశ్వర లయ బ్రహ్మగా బొబ్బిలి ప్రాంతం ఖ్యాతిని దేశవ్యాప్తంగా పెంపొందించిన మహోన్నత వ్యక్తి ఆదిభట్ల నారాయణదాసు అన్నారు. సాహిత్య రూపంలో, కథల రూపంలో నేటి యువతరానికి ఆయన జీవిత చరిత్రను తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆదిభట్ల ముని మనవడు ఆధ్వర్యంలో బొబ్బిలి పట్టణం, దిబ్బగుడ్డివలస గ్రామంలో మహిళలకు చీరల పంపిణీ చేశారు.

నేడు వైఎస్సార్ వర్ధంతి

రాజాం: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని రాజాం నియోజకవర్గ కేంద్రంలో మంగళవారం నిర్వహించనున్నామని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు రాజాంలో పార్టీ కార్యాల యం వద్ద తొలుత వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం మాధవబజార్ రోడ్డులోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేయనున్నామని, పలు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టనున్నామని తెలిపారు. రాజాం పట్టణంతో పాటు నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని కోరారు.

బాడంగి తహసీల్దార్‌గా వరప్రసాద్


తహసీల్దార్ వరప్రసాద్

బాడంగి: మండల తహసీల్దార్ (ఎఫ్ఏసీ)గా కె.వరప్రసాద్‌ను నియమిస్తూ కలెక్టర్ కార్యాలయం నుంచి సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. దత్తిరాజేరు మండలంలో హెచ్‌డీటీగా పనిచేసి, పదోన్నతిపై ఇక్కడికి వస్తున్నారు. ఇది వరకు ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన కె.సుధాకర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందడంతో ఆగస్టు 31న రిలీవ్ చేస్తూ ఆదేశాలు వచ్చాయి.

సామూహిక కుంకుమ పూజలు


కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

రేగిడి: అంబకండి గ్రామంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక మంటపంలో మహిళలు సోమవారం సామూహిక కుంకుమ పూజలు చేశారు.

విజేతలకు నగదు బహుమతులు ప్రధానం


విజేతలకు నగదు బహుమతులు అందజేస్తున్న సీఐ నారాయణరావు, తదితరులు

బొబ్బిలి: బొబ్బిలిలో 30,31 ఆర్ఎస్ఎల్ బ్యాడ్మింటన్ జోన్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహించారు. ఏ,బి కేటగిరిలో నిర్వహించిన ఈ పోటీల్లో ఏ కేటగిరిలో సాలూరుకు చెందిన భరద్వాజ్,సుధీర్ జట్టు విజేతగా నిలవగా, తగరపువలసకు చెందిన దినేష్,ఆదిత్యల జట్టు రన్నర్‌గా నిలిచింది. బి కేటగిరిలో సత్యనారాయణ, సింహాచలం జట్టు విజేతగా నిలవగా, రన్నర్‌గా సురేష్, త్రినాథ్‌ల జట్టు నిలిచింది. విజేతలకు బొబ్బిలి రూరల్ సీఐ కె.నారాయణరావు చేతులు మీదుగా నిర్వాహకులు సోమవారం నగదు బహుమతులు అందజేశారు. ఏ, బి కేటగిరిలో విజేతలుగా నిలిచిన జట్లుకు చెరో రూ.5 వేలు,ద్వితీయ స్థానంలో నిలిచిన జట్లుకు చెరో రూ.3 వేలు చొప్పున నగదు అందజేశామని టోర్నమెంట్ నిర్వాహకులు లోకేష్,శ్రీను, రాజేష్ తెలిపారు. పీడీ అసోసియేషన్ సెక్రటరీ ఎం.వెంకటనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వెన్నుపోటుకు కేరాఫ్ చంద్రబాబు

- 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో శంబంగి


చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: అధికారం కోసం ఎవరికైనా వెన్నుపోటు పొడవడానికి వెనుకాడని వ్యక్తి సీఎం నారా చంద్రబాబునాయుడు అని, వెన్నుపోటు రాజకీయాలకు ఆయన కేరాఫ్ అడ్రస్ అని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు విమర్శించారు. బొబ్బిలి మున్సిపాలిటీలోని 21వ వార్డు ఇందిరమ్మ కాలనీలో 'బాబుష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ కార్యాకర్తలు,నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను వివరించారు.ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన సూపర్ సిక్స్‌తో పాటు వందలాది హామీలను ప్రజలకు గుర్తు చేశారు. అధికార దాహంతో ఎన్నికల్లో ఇష్టానుసారంగా హామీలిచ్చిన చంద్రబాబు గద్దెనెక్కాక వాటిని మరిచిపోయాడని శంబంగి అన్నారు. తల్లికి వందనం పథకంలో నిబంధనల పేరుతో లక్షలాదిమందిని పథకానికి దూరం చేశారని ఆరోపించారు. ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామని చెప్పి ఒక్క సిలిండర్‌కే పరిమితమయ్యారన్నారు. మహిళలకు అన్ని బస్సుల్లోనూ ఫ్రీగా ప్రయాణించే అవకాశం ఇవ్వాలే తప్ప అయిదు బస్సు సర్వీసులకే పరిమితం చేయడం వల్ల కొట్లాటలు జరుగుతున్నాయని అన్నారు. పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు చోడిగంజి రమేష్‌నాయుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ సావు మురళీకృష్ణ, బుడా మాజీ చైర్మన్ ఇంటి గోపాలరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ అన్వర్ బాషా,నాయకులు రుత్తల నాగేశ్వరరావు,ఆయా వార్డుల ఇన్‌చార్జ్‌లు,కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం


బాడంగి హైస్కూల్‌లో విద్యార్థినులకు కరాటే శిక్షణ ఇస్తున్న కోచ్


తెర్లాం హైస్కూల్‌లో శిక్షణ ఇప్పిస్తున్న పోలీసులు

బాడంగి/తెర్లాం: ఆత్మరక్షణకు కరాటే ఎంతో దోహదపడుతుందని, బాలికలంతా కరాటేలో శిక్షణ పొందాలని బాడంగి, తెర్లాం ఎస్ఐలు తారకేశ్వరరావు, బి.సాగర్‌బాబు అన్నారు. బాడంగి, తెర్లాం మండలాల్లోని పలు ఉన్నత పాఠశాలల విద్యార్థినులు, వ్యాయామ ఉపాధ్యాయులకు ఆయా మండల కేంద్రాల్లోని ఉన్నత పాఠశాలల్లో కరాటేపై సోమవారం శిక్షణ ఇచ్చారు. ఎస్ఐలు మాట్లాడుతూ వ్యాయామ ఉపాధ్యాయులంతా కరాటేలో మెలకువలను నేర్చుకొని పాఠశాలల్లో విద్యార్థినులకు నేర్పించాలని సూచించారు. విద్యార్థినులు తప్పనిసరిగా కరాటే నేర్చుకోవాలని, అత్యవసర సమయాల్లో అది మిమ్మల్ని కాపాడుతుందని చెప్పారు. బాడంగి హైస్కూల్ హెచ్‌ఎం సత్యనారాయణ,, తెర్లాం ఏఎస్ఐ భాస్కరరావు, ఎంఈఓ జె.త్రినాథరావు, హెచ్‌ఎం రమేష్, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఒంటి గంటకే మూసేశారు..!


బొద్దాం సచివాలయంలో తాళాలు వేసి ఉన్న వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్ గది

రాజాం: రోజంతా లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేయాల్సిన అధికారులు సగంలోనే నిలుపుదలచేసిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. సోమవారం సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం అన్ని గ్రామాల్లో నిర్వహిం చగా, బొద్దాంలో గ్రామ సచివాలయ ఉద్యోగులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ఉదయం గ్రామాల్లో పింఛన్ పంపిణీచేసిన సిబ్బంది, మధ్యాహ్నం సచివాలయంలోని చాంబర్లకు తాళాలు వేసేసి రాజాం వెళ్లిపోయారు. విశాఖపట్నం, ఎస్.కోట, శ్రీకాకుళం తదితర ప్రాంతాల్లో జీవనం సాగిస్తున్న పింఛన్‌దారులు కొంత మంది పింఛన్ కోసం సచివాలయానికి వచ్చి పడిగాపులు కాశారు. సచివాలయంలో వీఆర్‌ఓ, డిజిటల్ అసిస్టెంట్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, వీపీఏ ఎవరూ లేరు. వీరంతా తమ గ్రామాలకు, రాజాం వెళ్లిపోయినట్లు తెలిసింది. దీంతో లబ్ధిదారులు మొర్రోమంటూ నిట్టూర్చారు. ఇక్కడి సిబ్బంది తీరుపై గ్రామస్తులు మండిపడుతున్నారు. ఈవిషయాన్ని ఎంపీడీఓ వి శ్రీనివాసరావు వద్ద సాక్షి ప్రస్తావించగా..బొద్దాం సచివాలయ సిబ్బంది తీరు పరిశీలిస్తామని, లబ్ధిదారుల ఫిర్యాదుమేరకు సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు

బాధ్యతగా పనిచేయాలి

రేగిడి: అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు బాధ్యతగా పనిచేయాలని రాజాం ఐసీడీఎస్ పీఓ డాక్టర్ కనకదుర్గ సూచించారు. ఉంగరాడమెట్ట వద్ద ఉన్న మోడల్ అంగన్‌వాడీ కేంద్రంలో బూరాడ సెక్టార్ పరిధి అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పీఓ మాట్లాడుతూ ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సక్రమంగా పంపిణీ చేయాలని సూచించారు. రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని, కేంద్రాల పరిస రాలను పరిశుభ్రంగా ఉంచాలని, విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని అన్నారు.

• పరామర్శ


వైస్ ఎంపీపీ వర్షిణి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న డాక్టర్ రాజేష్, తదితరులు

రాజాం సిటీ: బొద్దాం గ్రామానికి చెందిన మండల వైస్ ఎంపీపీ నక్క వర్షిణీమోహన్ తల్లి పోగోటి అనసూయమ్మ, అలాగే గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నక్క మోహన్ నానమ్మ ఆదిలక్ష్మి ఇటీవల మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ తలే రాజేష్ సోమవారం ఆ రెండు కుటుంబాలను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ రాజాం మండల రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీ బండి నర్సింహులు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ వాకముళ్ల చిన్నారావు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, సర్పంచ్‌లు నక్క శ్రీనివాసరావు, వంజరాపు విజయ్‌కుమార్, నక్క సత్యారావు, నక్క ఉమామహేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా కల్చరల్ వింగ్ అధ్యక్షుడు డాక్టర్ బి.నరేంద్ర, అలజంగి లక్ష్మణ, గండి పైడిరాజు, నక్క లోకేష్, బెండు లక్ష్మణరావు, బాణాన భాస్కరరావు, డి.బుజ్జి, రాము, అప్పలనాయుడు, గణేష్, తదితరులు ఉన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలంటూ ఆందోళన



ఆందోళన చేస్తున్న .గ్రీన్‌అంబాసిడర్లు, సీఐటీయూ నాయకుడు శ్రీనివాసరావు

రామభద్రపురం: గ్రీన్ అంబాసిడర్లకు బకాయి వేతనాలను తక్షణమే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బలస శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.స్థానిక మండల పరిషత్ కార్యాలయం ముందు గ్రీన్ అంబాసిడర్లతో కలిసి సోమవారం ఆందోళన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య పనులు చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు సుమారు 10 నుంచి 18 నెలల వేతనాలు పెండింగ్ ఉంచడం అన్యాయమన్నారు.నెలల కొద్దీ వేతనాలు చెల్లించకపోతే వారి కుటుంబ పోషణ ఎలా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వేతనాలను సర్పంచ్ ఖాతాలో కాకుండా నేరుగా గ్రీన్ అంబాసిడర్ల ఖాతాలో జమ చేయాలని కోరారు. అనంతరం ఎంపీడీఓ రత్నం,డిప్యూటీ ఎంపీడీఓ వెంకటరమణకు వినతిపత్రాలు అందజేశారు. గ్రీన్ అంబాసిడర్లు జి.సూర్యనారాయణ, ఎస్.రాములు, జి.సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బొబ్బిలిరూరల్: మండలంలోని మెట్టవలస, నారాయణప్పవలస, సీహెచ్.బొడ్డవలస ఫీడర్లలో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో ఆయా ఫీడర్ల పరిధి గ్రామాలకు మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని విద్యుత్‌శాఖ ఈఈ బి.రఘు సోమవారం తెలిపారు.ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు

మెంటాడ: ఇప్పలవలస పంచాయతీలో సర్పంచ్‌తో పాటు మరో నాయకుడు పంచాయతీ, ఉపాధిహామీ నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆ గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు గేదెల రామకృష్ణ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామ పంచాయతీ భవనంపై అంతస్తు నిర్మాణానికి గత ప్రభుత్వం ఉపాధి హామీ నిధులు సుమారు రూ.13లక్షలు మంజూరు చేసిందని, భవన నిర్మాణం పూర్తి చేయకుండానే సర్పంచ్ 2021 జూన్ నెలలో రూ.11.96 లక్షలు బిల్లులు తీసుకున్నారని, ఇప్పటికీ ఆభవనం పూరికాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. మరోనాయకుడు గ్రావెల్‌రోడ్డు నిర్మించామని చెప్పి పనులు చేయకుండానే రూ.5. 15 లక్షలు తినేశారని వివరించారు. వాటర్ ట్యాంక్ వద్ద బోర్ తీశామని చెప్పి స్థానిక నాయకులు సుమారు లక్ష రూపాయలు తినేశారని, అధికారులు,నాయకులు ఒక్కటై నిధులు దుర్వినియోగం చేశారని పేర్కొన్నారు.

వాహన తనిఖీలు

సంతకవిటి: మండల కేంద్రంలో ఎస్ఐ ఆర్.గోపాలరావు తన సిబ్బందితో కలిసి సోమవారం వాహన తనిఖీలు నిర్వ హించారు. వాహనాలకు సంబంధించినధ్రువ పత్రాలు లేని వారికి అపరాద రుసుం విధించారు. ద్విచక్ర వాహన చోదకులు తప్పక హెల్మెట్ ధరించాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే సంబంధిత వాహన యజమానులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

రాజాం సిటీ: పట్టణ పరిధి మెంటిపేట కాలనీలో నివాసం ఉంటున్న అంపోలు లక్ష్మి అదృశ్యంపై సోమవారం కేసు నమోదు చేశామని సీఐ కె.అశోక్‌కుమార్ తెలిపారు. విజయనగరంలో బుర్రకథ ఉందని, నాలుగైదు రోజుల్లో వస్తానని ఇంటి నుంచి వెళ్లిన లక్ష్మి పది రోజులైనా తిరిగి రాలేదని ఆమె కుమారుడు అఖిల్ ఫిర్యాదు చేశాడని సీఐ వివరించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

అఖిలభారత కిసాన్ ఆవిర్భావ దినోత్సవం

రేగిడి: సంకిలి గ్రామంలో అఖిలభారత కిసాన్ సభ (ఏఐకేఎస్) ఆవిర్భావ దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నారు జనార్దనరావు ఏఐకేఎస్ జెండాను ఆవిష్కరించారు.

విద్యార్థుల వివరాలు నమోదు చేయాలి

వంగర: పాఠశాలల వారీగా విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎంఈఓ–2 మీసాల కూర్మినాయుడు సూచించారు.స్థానిక ఎమ్మార్సీలో సీఆర్‌ఎంటీలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దూర ప్రాంతాల నుంచి పాఠశాలలకు వచ్చే విద్యార్థుల రవాణా చార్జీల అంశానికి సంబంధించి విద్యార్థుల వివరాలను కంప్యూటరీకరించాలని తెలిపారు.

పాఠశాల సందర్శన

తెర్లాం: కొల్లివలస ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ త్రినాథరావు సోమవారం సందర్శించారు. విద్యార్థుల హాజరు, ఇతర రికార్డులు, విద్యార్థుల వర్క్ బుక్‌లు, మధ్యాహ్న భోజన వంటలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో పాఠ్యాంశాలను చదివించి, వారి విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు.

యువకుడిపై దాడి

రాజాం సిటీ: స్థానిక పాలకొండ రోడ్డులో యువకుడిపై జరిగిన దాడికి సంబంధించి సోమవారం కేసు నమోదుచేశామని సీఐ కె.అశోక్‌కుమార్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు పట్టణ పరిధి గాంధీనగర్‌కు చెందిన దాసరి శివమణి గత నెల 31 సాయంత్రం 5గంటల ప్రాంతంలో చిలకపాలెం నుంచి రాజాం వస్తుండగా రాజాం మండలం అంతకాపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద రోడ్డుపై నలుగురు వ్యక్తులు శివమణిని అడ్డగించే ప్రయత్నంచేసి వెంబడించారు. పాలకొండ రోడ్డులోని రవి బేకరీ ఎదురుగా శివమణిని అధిగమించి తన వద్ద ఉన్న హెల్మెట్‌తో విజయ్ అనే వ్యక్తి కొట్టాడు. అలాగే విజయ్‌తో పాటు రాజు, మానస్, మరో వ్యక్తి తనపై దాడిచేశారని బాధిత యువకుడు ఫిర్యాదులో పేర్కొన్నాడని సీఐ తెలిపారు. ఈ మేరకు సోమవారం కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఇదిలా ఉండగా బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తాను జార్జియా దేశంలో ఎంబీబీఎస్ చదువుతున్నానని, సెలవుపై నెలరోజులు సొంత ఊరు వచ్చానని అన్నాడు. ఈ క్రమంలో తన బావ వావిలపల్లి సాయికిరణ్‌ను హైదరబాద్ బస్సు ఎక్కించేందుకు చిలకపాలెం వెళ్లి తిరిగి వస్తుండగా అంతకాపల్లి వద్ద ఒకే బైక్‌పై నలుగురు వ్యక్తులు వచ్చి అడ్డగించారన్నాడు. వారి నుంచి తప్పించుకుని వచ్చినప్పటికీ తనను వెంబడించి పాలకొండ రోడ్డులో దాడికి పాల్పడ్డారని తెలిపాడు. స్థానికులు వచ్చి వారించడంతో అక్కడి నుంచి వారు పరారయ్యారన్నాడు. ఇలా ఎందుకు చేస్తున్నారో అర్థం కావడంలేదని ఇతర దేశాల్లో స్వేచ్ఛగా తిరగగలుగుతున్నామని, ఇక్కడికి రావాలంటే భయపడాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని వాపోయాడు. ఇలాంటి వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాడు.

క్లుప్తంగా

నేత్రదానం మహత్తర కార్యక్రమం


నేత్రదానానికి అంగీకార పత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

రాజాం సిటీ: నేత్రదానం మహత్తర కార్యక్రమమని అప్తాలమిక్ అధికారి సప్పటి వసంతరావు అన్నారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా జిల్లా అంధత్వ నివారణాసంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు నేత్రదానంపై సోమవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మరణానంతరం నేత్రదానం చేయడం వల్ల మరో ఇద్దరి అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన వారవుతారని చెప్పారు.పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు నేత్రదానానికి అంగీకార పత్రాలు అందజేశారు. ఐసీడీఎస్ కార్యాలయ సిబ్బంది ప్రసన్న, నారాయణరావు, బంగారమ్మ పాల్గొన్నారు.

వండానపేటలో వైద్యశిబిరం


శిబిరంలో సేవలందిస్తున్న వైద్యాధికారి రోహిణీరాఘవ్, సిబ్బంది

రేగిడి: వండానపేట గ్రామ అంగన్‌వాడీ కేంద్రం వద్ద రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి రోహిణీ రాఘవ్ ఆధ్వర్యంలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. వందమందికిపైగా గ్రామస్తులకు వైద్యసిబ్బంది వివిధ వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసి, ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆరోగ్య కార్యదర్శులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నానో యూరియాపై అవగాహన

బొబ్బిలిరూరల్: పంటలకు రైతులు సాధారణ యూరియాకు బదులుగా నానో యూరియా, డీఏపీ వినియోగించడం ద్వారా బహుళ ప్రయోజనాలు ఉన్నాయని వ్యవసాయ శాఖ ఏడీఏ మజ్జి శ్యామ్‌సుందర్ తెలిపారు. పారాది గ్రామంలో పత్తి పంటకు నానో యూరియా పిచికారీ చేసే విధానంపై రైతులకు సోమవారం అవగాహన కల్పించారు.

కార్మికుల వివరాలు రిజిస్ట్రేషన్ చేయించాలి


మోటారు రవాణా సంస్థల యజమానులకు అవగాహన కల్పిస్తున్న అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కొండలరావు

రాజాం: అయిదుగురు, అంతకంటే ఎక్కువ మంది మోటారు రవాణా కార్మికులు కలిగి ఉంటే ఆయా యాజమాన్య సంస్థలు కార్మికుల వివరాలను మీసేవా కేంద్రాల్లో నమోదు చేయించాలని రాజాం అసిస్టెంట్ లేబర్ ఆఫీస ర్ బి.కొండలరావు సూచించారు. పట్టణంలోని పలు మోటారు రవాణా సంస్థల్లో సోమవారం తనిఖీలు చేశారు. అనంతరం ఓ ప్రైవేట్ వేదిక వద్ద యజమానులకు అవగాహన కల్పించారు. రవాణా కార్మికుల సంక్షేమం నిమిత్తం మోటారు రవాణా కార్మికుల చట్టం 1961 పనిచేస్తోందని చెప్పారు. కార్మికులకు సంక్షేమం అందాలంటే వారి వివరాలను తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయాలని సూచించారు.

ఆకట్టుకున్న దీపాలంకరణ


శివలింగం, స్వస్తిక్ ఆకారంలో వెలిగించిన దీపాలు

రాజాం సిటీ: వినాయక ఉత్సవాల్లో భాగంగా రాజాం పట్టణంలోని మారుతీనగర్ 3వ లైన్‌లో వినాయక మంటపం వద్ద సోమవారం చేపట్టిన దీపాలంకరణ ఆకట్టుకుంది. కాలనీకి చెందిన భక్తులు శివలింగం, త్రిశూలం, స్వస్తిక్ ఆకారంలో 5001 దీపాలను వెలిగించి తమ భక్తిప్రపత్తులు చాటుకున్నారు.

లడ్డూ ప్రసాదం వేలం


వేలంపాటలో లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్న నారాయణరావు

బొబ్బిలి: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా బొబ్బిలిలోని రెడ్డిక వీధిలో ట్రూ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మంటపంలో స్వామివారికి నైవేద్యంగా నివేదించిన లడ్డూకు సోమవారం వేలం పాట వేశారు. సింగవరపు రామారావు అనే వ్యక్తి రూ.19,999కు లడ్డూను కైవసం చేసుకున్నారు. అనంతరం వినాయక విగ్రహ నిమజ్జనం ఘనంగా నిర్వహించారు.